# 36.

# వేసవి తరగతుల ముగింపు సందేశం

తప్పుగానక సర్వ మొప్పుగా భావించి
శ్లాఘించుచుందురు సరస జనులు
తప్పును తప్పుగా ఒప్పును ఒప్పుగా
ప్రకటించుచుందురు ప్రాజ్ఞ జనులు
ఒప్పును తెలియక తప్పుగా భావించి
దూషించుచుందురు దుష్ట జనులు
ఒప్పులన్నియు బలిమి తప్పులుగా చేసి
కలహించుచుందురు కలుష జనులు
మొదట జూడ మూడిటనొక విధము కలదు
నాల్గవ స్థాయియందున్న నరుని అరయ
వీని కంటెను రాక్షసుండెవరు కలరు?
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!
ఎన్ని విద్యలు నేర్చియు ఏమి ఫలము
నొసటి వ్రాతను తప్పింప నెవరి తరము
చెడ్డ బుద్ధులు తన తల చేరెనేని
ఎండబారును బుద్ధులు బండబారు

పవిత్రాత్మ స్వరూపులైన విద్యార్థులారా!

**దైవబలమును మించిన బలం విశ్వమందు కానరాదు**

ఈనాడు మనము ఉన్నటువంటి స్థితికి మనమే కారణము. మంచికిగాని, చెడ్డకుగాని

srisathyasaivachanamrutam

మనకు పూర్వము చేసుకున్న కర్మఫలము యొక్క స్వరూపమే ఈనాటి స్థితికి కారణమైనది. అదేవిధముగ నీ భవిష్యత్తు యొక్క మంచి చెడ్డలకు ఈ ప్రస్తుత స్థితియందు మనము చేయునటువంటి కర్మలే వాటికి ఆధారముగా ఉంటుంటాయి అనే సత్యాన్ని మొదట గుర్తించాలి. మానవుని యొక్క విలువ తన రూప సౌందర్యములందుగాని, ఆస్తిపాస్తులయందుగాని, అధికార ఆడంబరముల యందుగానీ, క్షేత్రవిత్తాదులయందుగాని ఏమాత్రమూ లేదు. వస్తు ధన కనక వాహనాది వస్తువులన్నీ మేఘముల వలే కరగిపోవునవేగాని స్థిరమైనవిగా కానేరవు. కాని మానవుని యొక్క విలువ సత్శీలముపైనే ఆధారపడి ఉంటుంది. ఇట్టి పవిత్రమైన సత్శీలమును పోషించుకునే ప్రయత్నములో ఈనాటి యువకులు సరియైన ప్రయత్నములు కొనసాగించాలి. మనకు ధన కనక వస్తు వాహనాదులు ఉండవచ్చును. కానీ వాటితోబాటు ఈ సత్శీలమును ప్రధానముగా దృష్టియందుంచుకున్నప్పుడే మన జీవితమునకు శాశ్వతమైన కీర్తి, శాశ్వతమైన ఆనందమే కాక జగత్తుకు కూడను ఆదర్శప్రాయుడుగా ఉండగలవు. బుద్ధి బలమును, శరీరబలమును పురస్కరించుకొని విశ్వామిత్రుడు వసిష్ఠులవారిపై కయ్యమునకు కాలు దీసిన విషయము మీకు తెలిసినదే. కానీ కట్టకడపటికి తన అస్త్రములన్నీ నిర్వీర్యములైపోయినవి, దేహ సంబంధమైన బలము కూడా క్షీణించినది. బుద్ధికూడను యేమాత్రము ప్రకాశింపక పోయినది. ఇట్టి పరిస్థితిని పురస్కరించుకొని 'దుర్బలం క్షత్రియ బలం', బ్రహ్మతేజో బలం నిజబలమని గుర్తించుకొని తరువాత తపశ్శక్తికై బయలుదేరినాడు. అట్టి తేజోబలమును అభివృద్ధి పరచుకొని మనము లోకమునందు సాధించవలసిన దిగ్విజయమునకు తగిన కంకణము ఈనాడు కట్టాలి. మానవుడు ఎట్టి కార్యమునందు ప్రవేశించు టకు పూనుకున్నను తన బలమును, తన ధీబలమును మొదట పరిశీలించి తరువాత కార్యము చేయుటకు పూనుకోవాలి. తన తత్త్వమును తాను గుర్తించక, తన బలమును తాను యోచించక ఏదో సాధించగలనని కొంత తాత్కాలిక బలమును ఆధారము చేసుకొని ముందంజ వేయుటలో పరాభవమునకు గురి కాగలడు. ఈనాడు విద్యార్థులయందేగాక సర్వసామాన్యమైన మానవుని యందు కూడను తాత్కాలికమైన బలమునే ఆధారము చేసుకొని ముందంజ వేయుటలో పరాభవమునకు గురికాగలడు. ఈనాడు

sri sathyasai vahanamrutam

విద్యార్థులయందేగాక సర్వసామాన్య మైన మానవునియందు కూడను తాత్కాలికమైన బలమునే ఆధారము చేసుకొని ముందు జరగబోయే విషయమును ఏమాత్రము విచారించక ముందుకు వెళ్లి తదుపరి అనేక రకములైన విచారములకు గురియగుతున్నారు. దీనికి దుర్యోధన దుశ్శాసనాదులే సరియైన ఆదర్శములు. కేవలము ధర్మబలమునుగాని, హృదయ బలమునుగానీ యేమాత్రము విచారించక ధనబలమును, జనబలమును మాత్రమే తాను ఆధారము చేసుకొని ధర్మమూర్తులైన పాండవులపైన యుద్ధము చేయటానికి ప్రారంభించి తదుపరి వారు పడిన అవస్థలకు, కేవలము వంశమునే నాశనము చేసుకున్నటువంటి దౌర్భాగ్యమైన దుర్బలమే దీనికి కారణముగా తోచుతూ వచ్చింది. కృష్ణుని దగ్గరకు అర్జునుడు, దుర్యోధనుడు ఇద్దరూ వెళ్లినప్పుడు తనకు సైన్యము మాత్రమే కావాలని దుర్యోధనుడు కోరినప్పుడు అర్జునుడు నీవు మాత్రమే నాకు చాలు అని ప్రార్థించటం మీకు తెలిసిన విషయమే. దైవ బలమునకు మించిన బలము విశ్వమందు మనకు కానరాదు. సర్వ విశ్వము తన పొట్టలోనున్నటువంటి పరమాత్మ యొక్క బలము మనకు అండదండలుగా ఉంటున్నప్పుడు ఇంక మిగిలిన శక్తిసామర్థ్యములు, బలములు క్షణభంగురములు. మన భారతీయ సంస్కృతిని పురస్కరించుకొని, పవిత్రమైన చరిత్రలను ఆధారము చేసుకొని అనాది కాలమునుండి దిగ్విజయమును సాధిస్తూ, ఎట్టి ధర్మభూమిగా దీనిని తీర్చిదిద్దారో, ఎట్టి త్యాగభూమిగా పేరు తెచ్చారో, ఎట్టి కర్మభూమిగా దీనికి సార్థక నామాన్ని అందించారో ఈ నెల దినములనుండి అనుభవజ్ఞులైన పండితులు, సాధకులు, విజ్ఞానులు, చదువరులు అయిన పెద్దలందరు వివిధ మార్గములందు చాలా ఆనందముగా అందించారు. కాని మీకు అధికంగా చెప్పనక్కరలేదు. నెల దినములనుండి యీ పవిత్రమైన రత్నములను మీ హృదయస్థానములందు దాచుకున్నారు. దీనిని కేవలము మసి బొగ్గులగా మాత్రము మార్చక జీవిత పర్యంతము ఉత్తమమైన ఆచరణ మార్గములో సరియైన విలువకే దీనిని ఉపయోగించుకుంటారని నేను విశ్వసిస్తున్నాను. ఈనాడు జగత్తులో సర్వ సామాన్యముగా ధన కనక వస్తు వాహనాదులను లేక భవనములను, అనేక రూపములతో చేరిన వాటినే ధనము, సంపద, ఐశ్వర్యమని అనుకోటం కద్దు. అయితే ఇట్టి ధన కనక వస్తువాహనాదులు, భవనములు, ఆభరణములు కూడను దేహము ఉన్నంతవరకే

srisathyasaivachanamrutam

సంబంధము కలిగి ఉండవచ్చును గాని దేహము తదుపరి ఈ వస్తువులకు వారికి ఎట్టి సంబంధము ఉండదు. మన ధనము అస్థిరమైనది, అశాశ్వతమైనది, అసత్యమైనది కాదు. సత్శీలమే మనకు సరియైన ధనము. సదాచారమే సరియైన సంపద, బ్రహ్మజ్ఞానమే మన ఐశ్వర్యము. ఈ మూడింటిని మనము కాపాడుకునే ప్రయత్నము జరపాలి. ఈ మూడు వస్తువులను మూడు కాలములందు జాగ్రత్తతో, లక్ష్యమునుంచి, పెడమార్గములో ఈ ధన కనక వస్తు వాహనాదులను పోనివ్వక, సక్రమమైన మార్గములో దేశమునకు ఆదర్శ ప్రాయముగా తీర్చి దిద్దటానికి పూనుకోవాలి.

దివ్యాత్మస్వరూపులైన విద్యార్థులారా! కన్న తల్లిదండ్రులకు, దేశమాతకు, మన సంస్కృతికి చక్కని సత్కీర్తిని తేవాలని నేను ఆశిస్తున్నాను. ఇది భారత దేశము. భగవద్రతి కలిగిన దేశము ఈ దేశము. అట్టి భగవద్రతిని అభివృద్ధి చేయటానికి మనము పూనుకున్నప్పుడే మనము భారతీయుడు అని చెప్పే ధైర్యము మనకు ఉండవచ్చునే గానీ అట్టి భగవద్రతి లేనప్పుడు నేను భారతీయుడను అని చెప్పుకోవటం సిగ్గుచేటనే చెప్పవచ్చును. భారతదేశము యొక్క తత్వాన్ని మీకు అనేక పర్యాయములు చెప్పాను. భా-ర-త. భావరాగ తాళ సమ్మిళితం భారతము. ఈ భావరాగ తాళములు యిచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞాన శక్తి - ఈ మూడింటికి మన దేహము ఆలవాలమైనదిగా మనము భావించాలి. ఈ మూడు ఒకదానిని ఒకటి అనుసరించే నడవాలిగాని ఒకటి ఒకవైపున ఇంకొకటి మరొకవైపున పోయేటప్పటికి ఇది అపస్వరంగా వచ్చి వినటానికి కూడను ఇంపుగా లేకుండా ఒక విధమైన అసహ్యాన్ని కలిగింపజేస్తుంది. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తికి సంబంధించినదిగా ఉంటుండాలి. దానిని లక్ష్యమునందుకోవాలి. గాలి మేఘములవలె వచ్చిన మన భావములకు ఏమాత్రము మనము స్థానము నివ్వ కూడదు. చక్కగా విచారించి ఇది మంచియా చెడ్డయా, ఉపకారమా అపకారమా, ఇది మీ హృదయ స్థానమునుండి వచ్చినదైతే మీరు జ్ఞానముతో కొంతవరకు విచారణ సలిపి కొంతవరకు క్రియారూపములో చెప్పటానికి ప్రయత్నించాలి. ఈ తాత్కాలిక ఆవేశములకు మనము ఏమాత్రము గురి కాకూడదు. ఈ లేత వయస్సునందు ఉప్పొంగే ఆవేశములను అరికట్టేందుకు మనము శక్తిని సంపాదించుకోవాలి. ఈ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక

sri sathyasai vahini amrutam

బలములు పుష్టిగా వున్న ఈ సమయమునందే, మన ఉద్రేకములు అణచటానికి చేతకాకపోతే వృద్ధాప్యములో మనము ఏరీతిగా అణచగలము? కనుక ఈ వయస్సునందు సరియైన ఇంద్రియ నిగ్రహము చేసినప్పుడే వృద్ధాప్యములో పిలిచినప్పుడు పలికే గొఱ్ఱెలవలే మన చేతిలో చిక్కిపోతాయి. కనుక మనము ఇంద్రియనిగ్రహమునకు సరియైన లక్ష్యాన్ని అభివృద్ధి పరచుకోవాలి.

విద్యార్థులారా! ఈనాటితో మనము నియమించిన మాసము కాలము పూర్తి అయినది. రేపటి నుండి ఎవరి స్వస్థానములకు వారు వెళ్లే ప్రయత్నములో ఉంటారు. ఇక్కడ ఉన్నంతకాలమే ఈ డిసిప్లిన్, ఈ శ్రద్ధ, ఈ ఆచరణలు మన బృందావనమునకు వదలిపెట్టిపోక మీ యొక్క హృదయస్థానములో చేర్చుకొని మీరు ఎక్కడికి వెళ్లినప్పటికిని ఈ devotion, discipline, duty ఈ మూడు ఒక త్రిమూర్తి స్వరూపముగా భావించి ఎక్కడికి వెళ్ళినప్పటికి ఆచరణలో పెట్టి ఇతరులకు అందించటానికి తగిన ప్రయత్నములు సల్పాలి. మొన్నటి దినము చెప్పినట్లుగా ఏదో ఒక చెడిపోయిన కారును వర్క్‌షాపుకు తీసుకొని వెళ్లినప్పుడు ఆ వర్క్‌షాపులో పనికి రానివి తీసివేసి సరైన parts తగిలించి ఏవిధంగా ఆ కారును కండిషన్‌లో మన ఇంటికి తెస్తుంటామో అదేవిధముగా మీరు డొక్కు కార్లుగనో, పార్టులు పోయిన కార్లుగనో మన బృందావనమనే వర్క్‌షాపుకి వచ్చి చేరారు. ఇక్కడ అన్ని పార్ట్స్ చక్కగా తీర్చిదిద్ది సర్వీసు చేసి పెట్టాము. ఈ కార్లు సక్రమమైన రీతిలో ఇంటికి తీసుకువెళ్లినప్పుడే, మీ తల్లిదండ్రులుగానీ, మీ సహచరులుగానీ, మీ తోటివారుగాని, దీనిని చూచి చాలా ఆనందించగలరే గాని ఇక్కడున్న సమయములోపల ఈ రకమైన సమయం లోపల ఈరకంగా ఉంటుండి ఇల్లు చేరేటప్పటికి తిరిగి పాత అభ్యాసమునే మన వెంట జంటగా ఉండినప్పుడు తల్లిదండ్రులు కూడను తృప్తి పడరు. ఇంత కాలము ఇక్కడనుండి కాలము, కర్మము, కాయము కూడా వృధా పరచినవారుగా అవుతారు. కనుక లక్ష్యమును మీ హృదయస్థానమునందుంచుకొని ఎక్కడకు వెళ్లినా దీనిని ఆచరణ రూపమైన ప్రచార ప్రబోధలు సల్పాలని నేను ఆశిస్తున్నాను. కనుక మీరు ఆదర్శ ప్రాయులుగా నిలవాలనే ఉద్దేశ్యముతోనే నెలదినములు మిమ్మల్ని ఇక్కడ పెట్టుకొని మీ భవిష్యత్తుకు తగిన భద్రతమైన విషయములన్నియు కూడను అనేకమంది పెద్దల చేత చెప్పించి మీ హృదయాన్ని

srisathyasaivachanamrutam

నింపించాము. ఈ water tank కు ఏ చిన్న hole పెట్టుకున్నప్పటికిని ఇందులో చేరిన పదార్థమంతా క్రింద పడిపోతుంది. మీకు దక్కకుండా పోతుంది. కనుక మీ హృదయస్థానమున ఏవిషయ సంబంధమైన చిల్లులు పడకుండా చూచుకొని ఈ అందుకున్న పదార్థమును చక్కగా రక్షించుకొనే భద్రత మీరు కొంతవరకు లక్ష్యము నందుంచుకోవాలి.

**దేహశుద్ధి, హృదయశుద్ధి రెండూ ముఖ్యమే**

విద్యార్థులారా! ఈనాడు దేహమునకు మాత్రమే తెల్లని శుభ్రమైన వస్త్రములు ధరించామని అనుకోకూడదు. మీ హృదయముకూడా శుద్ధమైన వస్త్రముగా ఇంటికి చేరాలి. ఆవిధముగా చేరినప్పుడే, ఈ దేహము, ఈ హృదయము రెండూ శుద్ధిగా ఉండినప్పుడే మన జీవితము జ్ఞానసిద్ధిని పొందుతుంది. మీరు ఈనాడు white dress ఎక్కడ వేశారంటే white field లో వేశారు. హృదయమే ఒక field. బృందావనము. ప్రేమకు లయము బృందావనము. పరిశుద్ధమైన హృదయము white field. దేహమునకు white dress, హృదయము white, ప్రేమ పరిశుద్ధమైనది – మూడింటి యొక్క ఏకత్వము త్రిపుటి స్వరూపంగా ఉంటున్నాది.

**త్రిగుణం త్రిదళాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాప సంహారం ఏకబిల్వం శివార్పణం**

ఈనాడు శుద్ధమైన ప్రేమ, శుద్ధమైన హృదయము, శుద్ధమైన వస్త్రము మూడింటి యొక్క ఏకత్వములోపల భగవదర్పితమైన భావముతో మీరు భావించి ఈనాటి నుండి మీ యొక్క హృదయము, మీ యొక్క ప్రేమ, మీ యొక్క దేహము భగవదర్పితమైనదిగా మీరు విశ్వసించి సర్వకర్మలు భగవత్ప్రీత్యర్థంగా, సత్కర్మ, సదాలోచన, సచ్చింతన, సత్ప్రవర్తన, సత్కర్మ. ఇలాంటి వాటిలో సాధ్యమైనంత వరకు కాలమును సద్వినియోగపరచి భారతదేశమునకు తిరిగి శాశ్వతమైన సంస్కృతిని నిలబెట్ట brotherhood of man, fatherhood of God అనే విషయాన్ని మననం చేసుకోవాలి. One divine principle in all అదే brotherhood. అంతేగాని brother and sisters అని చెప్పేది flatform పైనే కాని ప్రాపరిటీని ఒకరికొకరు

ఇచ్చుకునేది లేదు. కనుక, ఆత్మవిశ్వాసము లోపలనే మనము brotherhood అనేది లక్ష్యము నందుంచుకోవాలి. భారతదేశములో ఏదో తెలిసో, తెలియకో చేసిన తప్పులకు గాని, పాపములకుగాని త్రివేణి స్నానము చేసిన తక్షణమే పాప పరిహారము జరుగుతుందనే విశ్వాసము కలదు. అయితే పాపములు చేయటము, తప్పులు చేయటము స్నానములాచరించటము, ఈవిధంగా ఎన్ని పర్యాయములు చేసినప్పటికిని ఇందులో ఫలితము దక్కదు. ఒక్క పర్యాయము హృదయ పూర్వకంగా పశ్చాత్తాపము సలిపితివా అదియే ప్రాయశ్చిత్తము. ఒక్క పర్యాయము ఈ త్రివేణీ స్నానము ఆచరించిన తక్షణమే మరి ఏ పాపములుగాని, తప్పులుగానీ చేయకుండా ఉండాలని దానియొక్క సిద్ధాంతము. అయితే ఈనాడు మీరు త్రివేణి సాన్నమును ఆచరించారు. ఇంతకు పూర్వమున్న తప్పులుగానీ, పొరపాట్లుగానీ మీలో పరిశుద్ధమైనవి. ఈనాటి నుండి మీరు తిరిగి ఆ తప్పులుగాని అట్టి పొరపాట్లకుగానీ స్థానమివ్వకుండా మీ హృదయాన్ని సుక్షేమంగా చూచుకోవటానికి పూనుకోవాలి. అయితే ఈ త్రివేణి అనే పేరు దేనివల్ల వచ్చిందంటే గంగ, యమునా ఈ రెండు నదులు మాత్రమే మనకు బాహ్యములో గోచరమవుతుంటాయి. సరస్వతి మనకు గోచరము కాదు. అది అంతర్వాహినిగా ఉంటుంది. అదేవిధముగా గంగానది శుద్ధమైన కర్మ వంటిది. స్వార్థరహితమైన ప్రేమ వంటిది యమున. ఈ రెండింటికి జ్ఞాన తత్వమును హృదయ స్థానమున అందుకున్నది సరస్వతి. కనుక ఈనాడు శుద్ధమైన కర్మలు చేయటానికి పూనుకోవాలి. ప్రతిఫలమును అపేక్షించని ప్రేమను అందించాలి. దీనినే భగవద్గీతయందు నిష్కామకర్మ అని పేరు. ఇట్టి కర్మమును మనము ఆచరించటానికి ప్రతి భారతీయుడు కంకణము కట్టుకోవాలి. భగవద్గీతలో మొదటి శ్లోకములో ధర్మక్షేత్రే కురుక్షేత్రే అని పలికే సమయంలో దకారమనేది మొదటి అక్షరము. చివరి శ్లోకము 'యత్రయోగీశ్వర కృష్ణో.... మమ'. మ అనేది కడపటి అక్షరము. మొదటిది దకారము. కడపటిది మకారము. ద-మ ఈరెండింటికి మధ్యలో ఉంటున్నాది భగవద్గీత. దమ అనగా ధర్మమే మనయొక్క జీవితము. ధర్మక్షేత్రం. ధర్మక్షేత్రము మన భారతదేశముననే అట్టి సార్థక నామము అందుకొంది. అయితే, రెండవది కురుక్షేత్రము అన్నారు. ఇది ఏమిటి అని యోచించుకోవచ్చును. కురు అనగా అన్నము అని ఒక అర్థము. అన్నమునకు బ్రహ్మము అని ఒక అర్థము. ఈ దేహము



sri sathyasai vahini

అన్నముపైనే ఆధారపడి యున్నది. అనగా బ్రహ్మాండముపైన ఆధారపడి ఉంటున్నాది. ఈ బ్రహ్మముపైన ఆధారపడి ఉన్నది దేనికోసం? ధర్మము కోసం. బ్రహ్మము దక్కాలంటే ధర్మము ఆచరించాలి అని. ధర్మక్షేత్రే కురుక్షేత్రే – ఈ రెండింటి అంతరార్థము మనము ఈ రకంగా తీసుకున్నప్పుడు అధర్మ మార్గములో ఈ కాయమును ప్రవేశపెట్టము. ఈ కురుక్షేత్రములోనున్న ధర్మక్షేత్రాన్ని మనము ధర్మమైన మార్గములో బ్రహ్మమును పొందాలి అనే అంతరార్థము కూడను దీనికి ఉన్నది. అందువలననే దీనిని శరీరి అన్నారు. అయితే ఈ శరీరి అనే పేరు ఎందువల్ల వచ్చిందంటే శరీరములో నివసించే వాడు కనుక దీనికి దేహి అని పేరు. ఇతనికి క్షేత్రజ్ఞ అని మూడవ పేరు. క్షేత్రమనే దేహమునందున్నవాడు కనుక క్షేత్రజ్ఞుడు అని పేరు. కనుక ఈవిధమైన అర్థములు మనము తీసుకున్నప్పుడు చెడుమార్గములోగాని, దుర్మార్గములోగానీ మన జీవితమున ప్రవేశపెట్టటానికి యేమాత్రము పూనుకోము.

ఆత్మరూపుడైన దేహికి ఏవిధమైన విలువ తగ్గటానికి వీలుకాదు. దేహములు మారవచ్చును గాని దేహి వెంట జంట ఉంటుంది. అది ఎట్లా అని మీకు సందేహము రావచ్చును. ఒక చిన్న ఉదాహరణము. మన దగ్గర ఒక తాంబూలం పెట్టె ఉండవచ్చు. అయితే కొంత కాలమునకు నీవు తాంబూలం పెట్టె నాకు అక్కర లేదని ఒక కంసాలికి ఇచ్చివేసి ఒక చిన్న టిన్నుగా నీవు మార్చుకోవచ్చును. తదుపరి దానిని ఒక ప్లేటుగానో, కప్పుగానో, సాసరుగానో చెప్పుకోవచ్చు. అయితే ఈ పెట్టె, టిన్ను, కప్పు, సాసరు రూపనామములు మారినాయి గాని సిల్వరు మారలేదు కదా! అదేవిధముగా మన రూప నామములు, సృష్టిలో అనేక మార్పులు జరగవచ్చు. ఆత్మ స్వచ్ఛమైన హృదయంగానే నిరంతరము ఉంటుంది. దానికి ఎట్టి మార్పులు రావు. కనుక మీరు అట్టి స్థిరమైన, నిర్మలమైన ఆత్మ పైన లక్ష్యమునందుంచుకొని మున్ముందు మన భారతదేశమునకు తగినటువంటి శాంతి భద్రతలను అందిస్తారని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

ఢిల్లీ ప్రిన్సిపాల్ ఒక ఉద్దేశ్యాన్ని అందించాడు. ఏవరైనా నీతో ఫైట్ చేయడానికి వస్తున్నారు అని కానీ వారితో ఎదురు తిరిగి ఫైట్ చేయాటానికి పూనుకోనక్కరలేదు. ఎవరితో ఫైట్ చేయటము. దేహములు రెండు వేరుగా ఉంటున్నాయి. దేహములు రెండు జడమే.

srisathyasaivachanamrutam

అక్కడ ఇక్కడ ఆత్మగా ఉంటున్నాది. ఆత్మతో ఫైట్ చేసేవాడు ఎలాంటి తెలివి తక్కువ వాడు. ఇతరులు ఏవిధమైన ఉద్రేకముతో, ఏవిధమైన చెడు భావముతో వచ్చినప్పటికీ మనము శాంతముగా ఉంటుండి దానిని చక్కబరచుకోటానికి దానిని సరియైన మార్గములో తెప్పించు కోటానికి ప్రయత్నము చేయాలి. మనము మెత్తగా ఉన్నకొలదీ వారు మరింత ఉద్రేకముతో పైన పడవచ్చును. కానీ పడినంత మాత్రమున మనకేమీ నష్టము లేదు. కాచిన చెట్టుకే రాళ్లదెబ్బలు. కాయలు లేని చెట్టును ఎవరూ కొట్టరు. మనము మంచిగా ఉన్నప్పుడే మనపైన అనవసరమైనవి అన్నీ పడుతుంటాయి. మన మంచిని మనము కాపాడుకోవాలి గానీ దారి తప్పిపోవటము చాలా తప్పు. ఈవిధమైన సద్గుణములను, సత్శీలములను, సదాచారములను ఈ బ్రహ్మతత్త్వమును మనయొక్క హృదయములో భద్రము చేసుకొని మానవత్వమనేదానికి సార్థకత కలిగిస్తారని ఆశిస్తున్నాను.

**(తేదీ 21-06-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam